క్లుప్తంగా

భక్తిభావం కలిగి ఉండాలి

మాజీ ఎంపీపీ శ్రీనివాస్‌యాదవ్



మహాపడి పూజలో శ్రీనివాస్ యాదవ్ తదితరులు

తలకొండపల్లి: ప్రతి ఒక్కరూ భక్తిభావం కలిగి ఉండాలని మాజీ ఎంపీపీ శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. మండల పరిధిలోని చీపునుంతల్లో మంగళవారం శివస్వాములు మహాపడిపూజను నిర్వహించారు. 41రోజులు భక్తి శ్రద్ధలతో శివదీక్షలు చేపట్టిన శివ స్వాములు.. గురుస్వామి సుదర్శన్‌గౌడ్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమానికి హాజరైన శ్రీనివాస్‌యాదవ్ పూజ ఖర్చుల నిమిత్తం రూ.5000 ఆర్థిక సహాయాన్ని అందజేశారు. బాలకుమార్‌గౌడ్, జంగయ్య, నారాయణ, మహేందర్, మహేష్ పాల్గొన్నారు.

చిన్నారెడ్డి నియామకంపై హర్షం



చిన్నారెడ్డిని సన్మానించిన నాయకులు

తలకొండపల్లి: రాష్ట్ర ప్రణాళిక సంఘం వైస్ చైర్మన్‌గా ఎన్నికైన మాజీ మంత్రి చిన్నారెడ్డిని పీఏసీఎస్ చైర్మన్ గట్ల కేశవరెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, శతాబ్ది టౌన్‌షిప్ డైరెక్టర్ శ్రీనివాసురెడ్డి మంగళవారం హైదరాబాద్‌లో కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి ఘనంగా సన్మానించారు. చిన్నారెడ్డి సలహాలు, సూచనలు, మార్గదర్శకత్వంలో రాష్ట్రం మరింత ముందుకు వెళ్తుందని వారు అభిప్రాయపడ్డారు. పాలమూరు బిడ్డ చిన్నారెడ్డి ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్‌గా ఎంపిక కావడం ఆనందంగా ఉందన్నారు.

బాధ్యతల స్వీకరణ



సీఐని సత్కరిస్తున్న ఎస్‌ఐ బల్‌రాం

ఆమనగల్లు: ఆమనగల్లు సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా డి.ప్రమోద్‌కుమార్ మంగళవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ సీఐగా పనిచేసిన విజయ్‌కుమార్ బదిలీ కాగా అల్వాల్ పోలీసు స్టేషన్‌లో పనిచేస్తున్న సీఐ ప్రమోద్‌కుమార్ ఆమనగల్లుకు బదిలీపై వచ్చారు. ప్రమోద్‌కుమార్‌ను స్థానిక ఎస్‌ఐ బల్‌రాం, సిబ్బంది ఘనంగా సన్మానించారు.

మొగి పురుగు నివారణపై అవగాహన

మంచాల: వరి పంటకు సోకే మొగి పురుగు నివారణ కోసం రైతులు లింగాకర్షక బుట్టలను ఏర్పాటు చేయాలని భారతీయ వరి పరిశోధన స్థాన కీటక విభాగం శాస్త్రవేత్త డాక్టర్ పద్మావతి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని బోడకొండలో రైతులకు వరి పంటకు సోకే మొగి పురుగు నివారణపై వారు అవగాహన కల్పించారు. యాసంగిలో వరిపంటకు మొగి పురుగు ఎక్కువగా సోకే ప్రమాదం ఉందన్నారు. రైతులు ముందస్తు జాగ్రత్తలు తప్పక తీసుకోవాలన్నారు. ఎలాంటి క్రిమిసంహారక మందులు వాడకుండా లింగాకర్షక బుట్టల ఏర్పాటుతో మంచి ఫలితాలు వస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి సరిత, సేవా స్ఫూర్తి ఫౌండేషన్ ప్రాజెక్ట్ మేనేజర్ రత్నాకర్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి బ్రహ్మోత్సవాలు

తలకొండపల్లి: మండల పరిధిలోని మల్లప్ప గుట్ట మల్లికార్జునస్వామి శివాలయ బ్రహ్మోత్సవాలు బుధవారం నుంచి ప్రారంభమై మార్చి 10 వరకు కొనసాగుతాయని ఆలయ అధ్యక్షుడు పాండయ్య తెలిపారు. భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేసినట్లు ఆలయ అధ్యక్షుడు పాండయ్య తెలిపారు.

ధరణి సమస్యలపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించండి: సీపీఎం

యాచారం: ధరణి స్పెషల్ డ్రైవ్ ద్వారా గ్రామాల్లో ఉన్న భూసమస్యలన్నీ పరిష్కరించాలని సీపీఎం మండల కార్యదర్శి ఆలంపల్లి నర్సింహ కోరారు. ఈ మేరకు యాచారం తహసీల్దార్ అయ్యప్పను మంగళవారం కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా నర్సింహ మాట్లాడుతూ.. మండలంలోని ప్రతి గ్రామంలో వందలాది భూ సమస్యలు ఉన్నాయని.. వాటిని వెంటనే పరిష్కరించాలని కోరారు. స్పెషల్ డ్రైవ్ ద్వారా గ్రామ పంచాయతీల వద్ద ప్రజల సమక్షంలోనే భూ సమస్యలు విని అక్కడిక్కడే పరిష్కరిస్తే బాగుంటుందని కోరారు.

‘గాలికుంటు’తో జాగ్రత్త

- వ్యాధి సోకితే పశువుల్లో పాల దిగుబడిపై తీవ్ర ప్రభావం
- టీకాలు, నివారణ చర్యలు తీసుకోవాలి
- కడ్తాల్ పశువైద్యాధికారి భానునాయక్



గాలికుంటు వ్యాధి సోకడంతో చొంగ కార్చుతున్న పాడిపశువు

కడ్తాల్: పశువులు, మేకలు, గొర్రెలకు సోకే గాలికుంటు వ్యాధి అత్యంత ప్రమాదకరం. ఈ వ్యాధి సోకిన పశువులు సరిగ్గా మేత మేయకపోవడంతో జీర్ణక్రియ మందగిస్తుంది. పాడిరైతులు ఏ మాత్రం అలసత్వం వహించినా పశువులు మృత్యువాత పడే అవకాశాలు ఉన్నాయి. వ్యాధి లక్షణాలను ముందస్తుగా గుర్తించి పశువైద్యుల ద్వారా తగు చికిత్సలు, టీకాలు వేసినట్లైతే ఎలాంటి ఇబ్బంది ఉండదని మండల పశు వైద్యాధికారి డాక్టర్ భానునాయక్ తెలిపారు. గాలికుంటు వ్యాధి ఎలా సోకుతుంది, వ్యాధి లక్షణాలు, వ్యాధి సోకినపుడు పశువుల్లో కలిగే మార్పులు, వ్యాధి బారినపడిన పశువులకు అందించే చికిత్సా విధానాలను ఆయన వివరించారు.

గాలికుంటు వ్యాధి ఎలా సోకుతుంది..?

- గాలికుంటు వ్యాధి ఏఓ ఆసియా–1 స్ట్రెయిన్‌తో వ్యాపిస్తోంది.
- బలహీనంగా ఉండే పశువులతో పాటు, దేశవాళి పశువుల్లో కంటే సంకర జాతి పశువుల్లో వ్యాధి సోకే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి.
- వ్యాధి సోకిన పశువుల్లో మరణాల శాతం తగ్గినప్పటికీ వాటిలో ఎదుగుదల లోపించి, బలహీనతకు గురవుతాయి.
- వ్యాధి సోకిన పశువుల్లో పాల దిగుబడి ఒక్కసారిగా తగ్గిపోతుంది.

గాలికుంటు వ్యాధి లక్షణాలు..

- గాలికుంటు వ్యాధి సోకిన పశువుల శరీర ఉష్ణోగ్రత 104–106 డిగ్రీల వరకు ఉంటుంది.
- నోరు, పళ్ల చిగుళ్లు, నాలుక, చనుమొనలపై పొక్కులు, ముట్టి లోపలి ప్రాంతాల్లో బొబ్బలు ఏర్పడి అవి 24 గంటల వ్యవధిలో చితికిపోవడంతో పశువులు నొప్పితో మేత మేయడం మానేస్తాయి.
- నోటి నుంచి చొంగ, జొల్లు కార్చడం వంటి లక్షణాలు కనిపిస్తాయి.
- కాళ్ల గిట్టల మధ్య బొబ్బలు ఏర్పడి కొద్ది సమయంలోనే చితికిపోవడంతో కాళ్లనొప్పితో పశువులు సరిగా నడవలేవు.
- పశువుల పొదుగుపై బొబ్బలు ఏర్పడి వాపు కనిపిస్తుంది. కొన్నికొన్ని సందర్భాల్లో బొబ్బలకు బ్యాక్టీరియా ఆశించడంతో చీముతో కూడిన బొబ్బలుగా మారి పశువులకు చికాకుకు గురిచేస్తాయి.
- ఈ వ్యాధి సోకిన పాడిపశువుల పాలు తాగిన దూడలు మరణించే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. దూడలకు పాలను వేడిచేసి తాగించడం మేలు.
- చూడితో ఉన్న పశువుల్లో గర్భస్రావాలు సంభవిస్తాయి.
- సేద్యం పనులు చేసే పశువులు వ్యాధి సోకితే పనులు చేయలేవు.
- పాడి పశువుల్లో పాల ఉత్పత్తి గణనీయంగా తగ్గిపోతుంది.
- వ్యాధి సోకిన పశువులు రక్తహీనతతో శ్వాసను కష్టంగా పీలుస్తాయి. బుస కొడుతూ ఎండ వేడిమికి తట్టుకోలేక నీరసించిపోతాయి.
- వ్యాధి సోకిన పశువులు రెండు మూడు రోజుల అనంతరం మేత తినడం ప్రారంభించినా.. వ్యాధివలన కలిగిన దుష్ఫలితాల వలన అవి కోలుకోవడానికి మూడు నుంచి నాలుగు నెలల సమయం పడుతుంది.

పశువులకు అందించే చికిత్స..

- పశువుల్లో ఏర్పడిన పుండ్లను గమనించి పర్మాంగనేట్ నీటితో వాటిని శుభ్రం చేయాలి
- నోటి పుండ్లకు బొరో గ్లిజరిన్, కాళ్ల పుండ్లకు జింక్ ఆక్సైడ్, లోరాక్సి, హిమాక్స్ వంటి ఆయింట్‌మెంట్స్ రాయాలి. ఈగలు, దోమలు వాళకుండా వేపనూనె, నిమ్లెంట్ లాంటి మందులు వాడాలి.
- ఒకవేళ వైరస్ మెడిసిన్ పనిచేయనప్పుడు తర్వాత కలిగే అనర్థాల నివారణకు యాంటిబయోటిక్స్ 3నుండి 5 రోజుల వాడాలి.
- గాలికుంటు వ్యాధి బారినపడిన పశువులకు ప్రత్యేక సంరక్షణ చర్యలు తీసుకోవాలి. బలహీనపడకుండా ప్రత్యేకంగా దృష్టి సారించాలి. సులభంగా జీర్ణమయ్యే పోషకాలతో కూడిన ఆహారం అందించాలి. జావ, జొన్నబువ్వ, చిటికెడు ఉప్పు, బెల్లంతో కలిపి తాగించాలి.
- మరీ బలహీనంగా ఉంటే గ్లూకోజ్ ఇవ్వాల్సి ఉంటుంది.

వ్యాధి నివారణ ఇలా...

పశువులకు గాలికుంటు నిరోధక టీకాలను మొదటిసారి మూడు నెలల వయస్సులో, నెలరోజుల తర్వాత బూస్టర్ డోసు వేయించాలి. తదుపరి ప్రతి సంవత్సరం క్రమం తప్పకుండా టీకా వేయించాలి. టీకాలు వేయించడం వల్ల, రెండు మూడు వారాల అనంతరం పశువుల్లో వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుంది. దీంతో ఆరునెలల వరకు వ్యాధి సోకే ప్రమాదం ఉండదు. నిండు చూడిగా ఉన్న పశువులకు ఈనిన తర్వాత టీకాలు వేయించడం మంచిది. గాలికుంటు నివారణ టీకాలు వేయించిన తదుపరి పశువుల్లో వ్యాధి నిరోధక శక్తి పెరిగి ఆరునెలల వరకు వ్యాధి బారిన పడకుండా ఆరోగ్యంగా ఉంటుంది.

పశువులకు టీకాలు వేయించాలి



ప్రతి ఆరునెలలకొకసారి పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేయించడం మంచిది. మార్చి 1 నుంచి ప్రారంభమై ఈ టీకా కార్యక్రమం ఈనెల 30వ తేదీవరకు మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో కొనసాగుతుంది. రైతులు సద్వినియోగం చేసుకుని పశువులను రక్షించుకోవాలి.

– డాక్టర్ భానునాయక్, పశువైద్యాధికారి, కడ్తాల్

సమాజసేవపై దృష్టి సారించాలి



చెన్నకిషన్‌రెడ్డిని సన్మానించిన క్లబ్ సభ్యులు

రాంరెడ్డి కంటి ఆస్పత్రి చైర్మన్, లయన్ డాక్టర్ దామోదర్‌రెడ్డి

కడ్తాల్: యువత సమాజ సేవపై దృష్టి సారించాలని రాంరెడ్డి కంటి ఆస్పత్రి చైర్మన్, లయన్ డాక్టర్ దామోదర్‌రెడ్డి అన్నారు. లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ మాజీ గవర్నర్ లయన్ గంగాపురం చెన్నకిషన్‌రెడ్డి జన్మదిన వేడుకలను పురస్కరించుకుని మంగళవారం మండల కేంద్రంలో ఏర్పాటుచేసిన అన్నదాన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా చెన్నకిషన్‌రెడ్డిని లయన్స్ క్లబ్ సభ్యులు, ప్రజాప్రతినిధులు ఘనంగా సన్మానించారు. లయన్స్ క్లబ్ ద్వారా రానున్న రోజుల్లో మరిన్ని సేవా కార్యక్రమాలు అందిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ ఆఫ్ ఆమనగల్లు అధ్యక్షుడు వెంకటేశ్వర్లుగౌడ్, సింగిల్‌విండో చైర్మన్ వెంకటేశ్‌గుప్తా, ఎంపీటీసీలు శ్రీనివాస్‌రెడ్డి, రాములుగౌడ్, సింగిల్ విండో డైరెక్టర్ వెంకటేశ్, మాజీ సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డి, లయన్స్ ప్రతినిధులు గోవర్ధన్‌రెడ్డి, మహేందర్ కుమార్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, అంజయ్యగుప్తా, శ్రీను, మహేశ్, రాజేందర్‌యాదవ్, లక్ష్మయ్య, ఓంకారం, యాదయ్య, రమేశ్, కొండల్‌రెడ్డి, పీఆర్‌ఓ పాషా తదితరులు పాల్గొన్నారు.

డిక్షనరీల పంపిణీ



డిక్షనరీలు పంపిణీ చేస్తున్న అసోసియేషన్ నిర్వాహకులు

కందుకూరు: మండల పరిధిలోని గూడూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హ్యూమన్ రైట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం విద్యార్థులకు డిక్షనరీలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఆంజనేయులు మాట్లాడుతూ.. విద్యార్థులు చెడు అలవాట్లకు బానిస కాకుండా తల్లిదండ్రులు, గురువులతో గౌరవంగా మెలగాలన్నారు. పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని కోరారు. కార్యక్రమంలో అసోసియేషన్ కోశాధికారి కె.వెంకటేశ్వర్లు గుప్తా, కార్యదర్శి విజయ్, జిల్లా కార్యదర్శి మల్లేశ్, జనరల్ సెక్రటరీ రవి, మండల ప్రెసిడెంట్ భరత్, గ్రామస్తులు చిందం శ్రీశైలం, హెచ్‌ఎం కిషన్, ఉపాధ్యాయులు ఎండీ అయూబ్, రోనాలిని తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నతస్థాయికి చేరుకోవాలి

కందుకూరు: విద్యార్థులు మంచి లక్ష్యాన్ని ఏర్పరచుకొని ఉన్నత స్థాయికి చేరుకోవాలని మండల పరిధిలోని మాన్యగూడకు చెందిన కాంగ్రెస్ నాయకుడు ఎగిరిశెట్టి నర్సింహ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలలోని విద్యార్థులకు రూ.10వేల విలువ గల పుస్తకాలను ఆయన పంపిణీ చేశారు. ఆయన వెంట మాధవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు ఆహ్వానం

మహేశ్వరం: ఘట్టుపల్లి వీరాంజనేయస్వామి ఆలయంలో జరగనున్న మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలకు హాజరుకావాలని ఎమ్మెల్యే సబితారెడ్డికి ఆలయ ట్రస్టీ సభ్యులు, వేద పండితులు, గ్రామ బీఆర్‌ఎస్ నాయకులు మంగళవారం ఆహ్వాన పత్రిక అందజేశారు. వీరాంజనేయస్వామి ఆలయం స్వయంభూ వెలసిందని, ప్రతియేటా మహా శివ రాత్రి బ్రహ్మోత్సవాలకు హాజరై ప్రత్యేక పూజలు నిర్వహిస్తామని ఎమ్మెల్యే తెలిపారు. బ్రహ్మోత్సవాలకు వైభవంగా నిర్వహించాలని నిర్వాహకులను ఎమ్మెల్యే కోరారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో ఆలయ ట్రస్టీ సభ్యులు కోరుపోలు ప్రభాకర్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ ఎస్.శ్రీశైలం, మాజీ పీఏసీఎస్ డైరెక్టర్ ఎండీ. సాదత్, నాయకులు విష్ణువర్ధన్‌రెడ్డి, బి.రవి, స్వామి, గోవర్ధన్‌రెడ్డి, ఎర్ర శంకరయ్య, శేఖర్, ఆంజనేయులు, నర్సింహ, వినోద్, బాలు నాయక్, ఆలయ పూజారులు, గ్రామస్తులు తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌ల పంపిణీ



విద్యార్థినులకు పరీక్ష ప్యాడ్‌లు పంపిణీ చేసిన నాయకులు

ఆమనగల్లు: ఆమనగల్లు పట్టణంలోని కస్తూర్బాగాంధీ బాలికల గిరిజన విద్యాలయంలో ఎస్‌ఎస్‌సీ విద్యార్థులకు మంగళవారం మండల ఎన్‌ఎస్‌యూఐ అధ్యక్షుడు ఫరీద్ పరీక్షా ప్యాడ్‌లు, పెన్నులను పంపిణీ చేశారు. ఫరీద్ మాట్లాడుతూ.. పరీక్షలు మంచిగా రాసి ఉత్తీర్ణులు కావాలని కోరారు. ఫలితాల్లో 10/10 గ్రేడ్ సాధించిన విద్యార్థులకు రూ.5 వేల నగదు బహుమతి అందిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో గిరిజన విద్యాలయ ప్రత్యేకాధికారి పద్మజ్యోతి, ఎన్‌ఎస్‌యూఐ నాయకులు మహేశ్, అబ్దుల్, రాహుల్, పవన్, గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

యాదవులు అన్ని రంగాల్లో రాణించాలి

కందుకూరు: యాదవులు విద్య, వ్యాపార, రాజకీయ రంగాల్లో రాణించాలని యాదవ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు అనిల్‌కుమార్‌యాదవ్ సూచించారు. మండల కేంద్రంలో సోమవారం రాత్రి యాదవ సంఘం మండల అధ్యక్షుడు పసుపుల పర్వతాలుయాదవ్ ఆధ్వర్యంలో సీఐ మక్బూల్‌జానీతో కలిసి ఆయన నూతన కేలండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యాదవుల్లో పేద విద్యార్థులు, పేదలను అన్ని విధాలా ఆదుకోవాలన్నారు. అందుకు అందరూ సంఘటితంగా మారి సేవా రంగాల్లో ముందుండి ఆదర్శంగా మారాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐ శ్రావణ్, యాదవ సంఘం నియోజకవర్గం అధ్యక్షుడు మేకల కృష్ణయాదవ్, మాజీ మండల అధ్యక్షుడు కన్నయ్యగారి బాల్‌రాజ్‌యాదవ్, ఆ సంఘం నాయకులు లక్ష్మయ్యయాదవ్, సుధాకర్ యాదవ్, నర్ల రాములుయాదవ్, నర్ల నరసింహా యాదవ్, సాటు మైసయ్యయాదవ్, రామకృష్ణయాదవ్, జనార్దన్‌యాదవ్, శ్రీనివాస్‌యాదవ్, వెంకటగిరియాదవ్, భిక్షపతియాదవ్, హనుమంతుయాదవ్, మల్లేశ్‌యాదవ్, శ్రీనుయాదవ్, వెంకటేశ్‌యాదవ్, గ్రామ శాఖ అధ్యక్షుడు నాగేశ్‌యాదవ్, రాజు యాదవ్, కృష్ణయాదవ్, ఆంజనేయులుయాదవ్, యాదయ్యయాదవ్, శ్రీశైలంయాదవ్, సత్యం యాదవ్, విశ్వనాథ్‌యాదవ్, సత్యంయాదవ్, కుమార్‌యాదవ్ పాల్గొన్నారు.

ఎర్రకుంటలో పోలీసు కవాత్

పహాడీషరీఫ్: రాబోయే లోక్‌సభ ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేలా తగిన చర్యలు తీసుకుంటామని మహేశ్వరం ఏసీపీ పి.లక్ష్మీకాంత రెడ్డి అన్నారు. బాలాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని షాహిన్‌నగర్ ప్యారడైజ్ ఫంక్షన్‌హాల్ నుంచి ఎర్రకుంటలోని పింక్ ప్యాలెస్ వరకు మంగళవారం సాయంత్రం కేంద్ర బలగాలతో పోలీసు కవాత్ నిర్వహించారు. బాలాపూర్, పహాడీషరీఫ్ ఇన్‌స్పెక్టర్లు భూపతి, గురువారెడ్డిలతో కలిసి ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ.. ప్రతి ఓటర్ నిర్భయంగా పోలింగ్ బూత్‌కు వెళ్లి ఓటు వేసే వాతావరణాన్ని కల్పిస్తామన్నారు. రౌడీషీటర్లపై ప్రత్యేక నిఘా ఉంచామన్నారు. నేరాల నియంత్రణ కోసం స్థానిక ప్రజలతో అవగాహన కార్యక్రమాలు కూడా చేపడతామన్నారు. కార్యక్రమంలో బాలాపూర్, పహాడీషరీఫ్ ఠాణాల డీఐలు మధు, సుధీర్ కృష్ణ, ఎస్సైలు మహేందర్ జానీ, మధు, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

నీటిఎద్దడి తలెత్తకుండా చర్యలు

ఎంపీపీ కృపేశ్



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ కృపేశ్

ఇబ్రహీంపట్నం రూరల్: వేసవిలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఇబ్రహీంపట్నం ఎంపీపీ పీ.కృపేశ్ సూచించారు. ఆయన అధ్యక్షతన మంగళవారం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం జరిగింది. మార్చి 1వ తేదీ నుంచి అర్హులైన వినియోగదారులకు జీరో విద్యుత్ బిల్లు రావాల్సి ఉండగా ఎప్పటి మాదిరిగానే బిల్లులు వచ్చాయని దీంతో జనం అయోమయంలో ఉన్నారంటూ పలువురు సభ్యులు సభ దృష్టికి తీసుకువచ్చారు. తెల్లరేషన్ కార్డున్నప్పటికీ కొందరికి రూ.వందల్లో బిల్లు వచ్చినమాట వాస్తవమేనని ముందుముందు వీటిని సరిచేస్తామని ట్రాన్స్‌కో ఏఈ శ్రీనివాస్ తెలిపారు. వీరు బిల్లులు చెల్లించాల్సిన అవసరం లేదని ఒకవేళ చెల్లించినా వచ్చే బిల్లులో వారి ఖాతాలో జమ అయినట్లుగానే వస్తుందని చెప్పారు. ఇంకా ఎవరికైనా సందేహాలుంటే తెల్లరేషన్ కార్డు, ఆధార్ నంబరు, ప్రజా పాలన దరఖాస్తు రసీదు, కరెంట్ బిల్లుతో స్థానిక విద్యుత్ కార్యలయంలో సమర్పించాలన్నారు. కరోనాకు ముందు ఇబ్రహీంపట్నం నుంచి పోల్కంపల్లి, అనాజీపూర్ మీదుగా హయత్‌నగర్ బస్సు నడిచేదని తిరిగి ఈ బస్సును పునరుద్ధరించాలని పోల్కంపల్లి ఎంపీటీసీ మంగ ఆర్టీసీ అధికారులను కోరారు.

రేషన్ దుకాణాలు ఏర్పాటు చేయండి..

మండలంలో పౌరసరఫరాల శాఖకు సంబంధించిన మొత్తం 37 రేషన్ దుకాణాలుండగా ఏడు చోట్ల ఖాళీలు ఉన్నాయని వీటిని భర్తీ చేయాలని కోరారు. ఉపాధి హామీ పథకంలో ప్రస్తుతం మండలంలో 1135 మంది కూలీలు పనిచేస్తున్నారని ఈపథకం ద్వారా ఇప్పటికే రూ.512 కోట్లు ఖర్చు చేసినట్లు ఇన్‌చార్జి ఏపీఓ తిరుపతిచారీ తెలిపారు. గత ఆరు వారాలుగా కూలీలకు బిల్లులు రావాల్సి ఉందన్నారు. ఎన్‌పీసీ క్లియర్ రాగానే వారి ఖాతాల్లో డబ్బులు జమ అవుతాయని తెలిపారు. సభ్యులు లేవనెత్తిన సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఎంపీపీ అధికారులను కోరారు. ఈ సమావేశంలో వైస్ ఎంపీపీ మంచిరెడ్డి వెంకట ప్రతాప్‌రెడ్డి, తహసీల్దార్ సునీత, ఎంపీడీఓ వెంకటమ్మ, డీఆర్‌డీఓ ఏపీడీ సక్రియానాయక్, పంచాయతీరాజ్ ఏఈ ఇంద్రాసేనారెడ్డి, ఇరిగేషన్ ఏఈ రాజ్యలక్ష్మి, ఐకేపీ ఏపీఎం రవీందర్‌తో పాటు ఎంపీటీసీలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు .

మంత్రి పొన్నంను కలిసిన మక్తమాధారం గ్రామస్తులు

కడ్తాల్: రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్‌ను మంగళవారం హైదరాబాద్‌లో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ ఆధ్వర్యంలో మక్తమాధారం గ్రామస్తులు కలిశారు.మక్తమాధారం గ్రామం నుంచి నేదునూర్ వరకు, మక్తమాధారం–పెద్దారెడ్డిచెరువు(కడ్తాల్) వరకు బీటీ రోడ్లు వేయాలని, అదే విధంగా హైదరాబాద్ నుంచి మక్తమాధారం మీదుగా మిడ్జిల్ వరకు ఆర్టీసీ బస్సు సర్వీసు నడపాలని వారు వినతిపత్రం అందజేశారు. కిసాన్ సెల్ మండల అధ్యక్షుడు బాల్‌రాజ్, నాయకులు రామకృష్ణ, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

భవిత కేంద్రం సందర్శన

ఇబ్రహీంపట్నం రూరల్: ఇబ్రహీంపట్నంలోని ప్రత్యేక అవసరాలు గల దివ్యాంగ విద్యార్థుల కేంద్రాన్ని మంగళవారం వీహెచ్‌పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కాళ్ల జంగయ్య సందర్శించారు. దివ్యాంగ పిల్లలకు విద్యా బోధన చేస్తూ కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేస్తున్న ఐఈఆర్‌పీ ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని ఆయన కోరారు.

ఆర్థికసాయం అందజేత

మంచాల: ఇటీవల విద్యుత్ స్తంభంపై నుంచి కింద పడి గాయపడిన గ్రామ పంచాయతీ సిబ్బంది రమేష్‌కు.. ప్రత్యేకాధికారి వెంకట ప్రసాద్, పంచాయతీ కార్యదర్శి శోభ మంగళవారం రూ.15వేల ఆర్థిక సహాయం అందించారు. ప్రమాదంలో గాయపడిన రమేష్ ఇబ్రహీం పట్నంలో ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడని.. వైద్యానికి రూ.80వేలకు పైగా ఖర్చయ్యిందని సీఐటీయూ మండల కార్యదర్శి కృష్ణ అన్నారు. రమేష్ వైద్యానికి అయిన ఖర్చునంతటిని ప్రభుత్వమే భరించాలని ఆయన కోరారు. అలాగే ఆరోగ్యం బాగుపడే వరకు వేతనం కూడా చెల్లించాలని డిమాండ్ చేశారు.

ప్రజాదీవెన సభకు తరలిరండి

డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి

కడ్తాల్: లోక్‌సభ ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా బుధవారం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో నిర్వహిస్తున్న పాలమూర్ ప్రజాదీవెన బహిరంగ సభను జయప్రదం చేయాలని డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో మంగళవారం కాంగ్రెస్ పార్టీ నాయకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ..పాలమూరు ప్రజాదీవెన బహిరంగ సభకు సీఎం రేవంత్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరుకానున్నట్లు తెలిపారు. కల్వకుర్తి నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ఆధ్వర్యంలో పెద్దఎత్తున్న జన సమీకరణ చేస్తున్నట్లు తెలిపారు. పార్టీ శ్రేణులు, కార్యకర్తలు, అనుబంధ విభాగాల నాయకులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి సభను జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో మాజీ జెడ్పీటీసీశ్రీనివాస్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహులు, నాయకులు బీచ్యానాయక్, మల్లేశ్‌గౌడ్, కోఆప్షన్ సభ్యుడు జహంగీర్‌బాబా, సింగిల్‌విండో డైరెక్టర్ వెంకటేశ్, లక్ష్మయ్య, రాంచందర్, శ్రీను తదితరులు ఉన్నారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

మంచాల: మండల పరిధిలోని నోముల గ్రామ ప్రభుత్వ పాఠశాల పూర్వ విద్యార్థులు అదే పాఠశాలలో మంగళవారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈసందర్భంగా చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకొని రోజంతా ఆనందంగా గడిపారు. వ్యక్తిగత జీవితంలో నిత్యం హడావిడిగా ఉండే వారందరూ ఒక్కదగ్గర కలుసుకొని సందడి చేశారు. దాదాపు 35 సంవత్సరాల అనంతరం కలిసామని ఈ ఆనందం మాటల్లో చెప్పలేమని తెలిపారు. ఈ కార్యక్రమంలో అప్పటి ఉపాధ్యాయులు బలరాం, బుగ్గయ్య, గోవర్ధన్‌చారి, పూర్వ విద్యార్థులు సుదర్శన్‌రెడ్డి, రాంరెడ్డి, పి.జగన్, జంగయ్య, కిషన్, శ్రీనివాస్‌రెడ్డి, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.